సేంద్రియ ఆహారమే ఆరోగ్యానికి మేలు


దోమ: దోర్నాల్‌పల్లిలో మాట్లాడుతున్న పాలనాధికారి ప్రతీక్ జైన్

పరిగి గ్రామీణ, దోమ- న్యూస్‌టుడే: ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటలు ఆరోగ్యానికి చాలా మంచివని కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. బుధవారం పరిగి మండలం నజీరాబాద్, హన్మాన్‌గండి, దోమ మండలం దోర్నాల్‌పల్లిలో వాసన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పండిస్తున్న సేంద్రియ పంటలను అధికారులతో కలిసి పరిశీలించారు. రసాయన మందులు వాడకుండా సాగుచేస్తున్న చిరుధాన్యాలు, వరి, కూరగాయల పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా అరక రైతులతో సాగు వివరాలు అడిగి తెలుసుకొన్నారు. సాగు విధానం బాగుందన్నారు. రైతులకు సహకరిస్తున్న వ్యవసాయ విద్యార్థులను అభినందించారు. బాసుపల్లిలోని సుస్థిర వ్యవసాయ సేవాకేంద్రాన్ని సందర్శించారు. కార్యక్రమంలో తహసీల్దార్లు ఆనంద్‌రావు, పురుషోత్వం, ఎంపీడీవో కరీం, నాబార్డు డీడీఎం అఖిల్, వాసన్ ప్రతినిధులు భాగ్యలక్ష్మి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

తాండూరు గ్రామీణ ఠాణాకు గుర్తింపు


డీజీపీ నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న ఎస్సై విఠల్‌రెడ్డి

తాండూరు గ్రామీణ: గౌతాపూర్ శివారులోని ఠాణాకు రాష్ట్రస్థాయిలో గుర్తింపు దక్కింది. ఫిర్యాదుదారులతో పోలీసుల వ్యవహార శైలి, పనితీరుపై ఆన్‌లైన్‌లో సిటిజన్ ఫీడ్ బ్యాక్‌ను పోలీసుశాఖ సేకరించింది. తాండూరు గ్రామీణ ఠాణాకు చోటు లభించింది. బుధవారం ఎస్సై విఠల్‌రెడ్డికి డీజీపీ జితేందర్ ప్రశంసాపత్రం అందించి అభినందించారు.

పర్యవేక్షణ ముమ్మరం!



న్యూస్‌టుడే- వికారాబాద్ మున్సిపాలిటీ, పరిగి

విద్యారంగం బలోపేతానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగానే రాష్ట్రవ్యాప్తంగా మండల విద్యాధికారులను నియమించింది. జిల్లాలోని 20 మండలాలకు సీనియర్ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు విద్యాధికారులుగా వచ్చారు. త్వరలో బాధ్యతలు స్వీకరించనున్నారు. ఇప్పటికే బడుల్లో మౌలిక సదుపాయాలు కల్పించారు. ఇకపై పాఠశాలలపై పర్యవేక్షణ ముమ్మరం కానుంది. ఇప్పటి వరకు జిల్లాలోని 20 మండలాలకు రెగ్యులర్ ఎంఈవో ఒక్కరే ఉన్నారు. మిగతా మండలాలకు ప్రధానోపాధ్యాయులే ఇన్‌ఛార్జులుగా కొనసాగారు.

జిల్లాలో 1,063 బడులు..: జిల్లాలోని 20 మండలాల్లో 1,063 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలతో పాటు గురుకులాలు, ఆదర్శల్లో సుమారు లక్ష దాకా విద్యార్థులు చదువుతున్నారు. రెగ్యులర్ ఎంఈవోలు లేకపోవడంతో తనిఖీల్లేవు. ఉపాధ్యాయులపై సరైన పర్యవేక్షణ కరవైంది. కొత్తగా నియమితులైన మండల విద్యాధికారులు దృష్టి సారిస్తే బడుల పనితీరు మెరుగుపడుతుందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

పది ఫలితాల్లో వెనుకబాటు..

బడులపై పర్యవేక్షణ కరవై గతేడాది పదో తరగతి ఫలితాల్లో చివరి స్థానంలో నిలిచింది. ఉపాధ్యాయులు సమయపాలన పాటించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. సరైన సమీక్షలు లేక విద్యావ్యవస్థ గాడి తప్పుతోంది. ప్రభుత్వ పాఠశాలల్లో పేద, మధ్య తరగతి కుటుంబాల వారే ఎక్కువగా చదువుతుంటారు. సరైన పర్యవేక్షణ లేక పిల్లల భవిష్యత్తు అంధకారంలో పడే ప్రమాదముంది. పాత ఫలితాలు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత వీరిపై ఉంది.

విద్యావ్యవస్థ మెరుగుపడుతుంది..



మండల విద్యాధికారులను నియమించడం మంచి పరిణామం. ఎప్పట్నుంచో నియమించాలని కోరాం. ఎంఈవోలు వారికి కేటాయించిన మండలాలను పూర్తిస్థాయిలో పర్యవేక్షిస్తారు. ఫలితాలు మెరుగుపడటానికి ఆస్కారముంది.

– రేణుకాదేవి, జిల్లా విద్యాధికారిణి.

పూర్తిస్థాయి ఎంఈవోలను నియమించాలి..



మండల నోడల్ అధికారులు, ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలకు మండల విద్యాధికారి బాధ్యతలను అదనంగా అప్పగించారు. పూర్తిస్థాయిలో ఒకే బాధ్యతను అప్పగిస్తే బాగుండేది. అప్పుడే పర్యవేక్షణ సక్రమంగా కొనసాగుతుంది. ప్రస్తుతం ఒక్కరే మూడు రకాల బాధ్యతలను నిర్వర్తించాల్సి ఉంటుంది.

– కె.చంద్రశేఖర్, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు.

మండలం	ఎంఈవో
బంట్వారం	పి.వెంకటేశ్వరావు
బషీరాబాద్	జి.విజయకుమార్
బొంరాస్‌పేట	ఎన్.హరిలాల్
చౌడాపూర్	సి.రాంచందర్
ధారూర్	శ్రీనివాస్‌రెడ్డి
దోమ	జి.వెంకట్
దౌల్తాబాద్	వెంకటస్వామి
దుద్యాల	విజయరామారావు
కొడంగల్	కె.రామిరెడ్డి
కోట్‌పల్లి	చంద్రప్ప
కుల్కచర్ల	హబీబ్ అహ్మద్
మర్పల్లి	అంజిలయ్య
మోమిన్‌పేట	బి.మల్లేశం
నవాబ్‌పేట	ఇ.గోపాల్
పరిగి	ఎం.గోపాల్
పెద్దేముల్	పి.నర్సింగ్‌రావు
పూడూరు	వి.సాయిరెడ్డి
తాండూరు	జె.వెంకటయ్య
వికారాబాద్	బాబుసింగ్
యాలాల	ఎస్.సుధాకర్‌రెడ్డి

మహిళల ఆర్థికాభివృద్ధికి మరో అవకాశం

త్వరలో డ్వాక్రా సంఘాలకు వడ్డీలేని రుణాలు



న్యూస్‌టుడే- వికారాబాద్, కొడంగల్: మహిళల ఆర్థికాభివృద్ధికి మరో అవకాశం లభించనుంది. డ్వాక్రా సంఘాలకు త్వరలో వడ్డీలేని రుణాలు అందించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోనుంది. దీంతో జిల్లాలోని 15,525 స్వయం సహాయక సంఘాల్లో సభ్యులుగా ఉన్న 1,62,683 మందికి ప్రయోజనం చేకూరనుంది. సంఘాల్లో చేరని మహిళల వివరాలు సేకరించనున్నారు. ఎందుకు చేరలేదని ఆరా తీయనున్నారు. ఓటరు జాబితా ఆధారంగా గ్రామాల వారీగా ఇంకా ఎంత మంది కొత్తగా చేరతారనేది తేల్చనున్నారు.

జిల్లా సమాఖ్య: 01
మండల సమాఖ్యలు 19
గ్రామ సంఘాలు 657

పునరుద్ధరణకు కార్యాచరణ..: తీసుకున్న రుణాలు చెల్లించకపోవడం, క్రియాశీలకంగా కార్యకలాపాలు కొనసాగించకపోవడంతో పలు డ్వాక్రా సంఘాలు స్తబ్దుగా మారాయి. ఇలాంటి సంఘాలను గుర్తించి పునరుద్ధరించేలా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకునేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నారు. స్వయం సహాయక సంఘాలకు బ్యాంకులు చేయూతనివ్వడంతో మహిళలు ఆర్థిక సాధికారత సాధిస్తున్నారు. ఆర్నెల్ల తరవాత సంఘం పొదుపుతో బ్యాంకు లింకేజీ రుణాలు మంజూరు చేస్తున్నారు. అనంతరం వాయిదా పద్ధతిలో కిస్తీలు చెల్లిస్తే ఎప్పటిలా రుణం మొత్తాన్ని పెంచుతున్నారు. రూ.5 లక్షల వరకు రుణ వెసులుబాటు కల్పిస్తున్నారు. బ్యాంకు రుణాలతోపాటు పావలా వడ్డీతో స్త్రీనిధి రుణాలు పొందుతున్నారు. దీంతో మహిళా సంఘాల్లోని సభ్యులు కుటుంబానికి అండగా నిలుస్తూ.. వ్యాపారంలో రాణిస్తున్నారు.

రుణ లక్ష్యం రూ.46.3 కోట్లు..

జిల్లాలోని మహిళా సంఘాలకు క్రమం తప్పకుండా నెలకోసారి సమావేశాలు నిర్వహిస్తూ సెర్ప్ పోర్టల్‌లోని ఎస్‌హెచ్‌జీ ద్వారా లావాదేవీలకు సంబంధించిన దస్త్రాలను ఎప్పటికప్పుడు నమోదు చేస్తున్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికిగాను రూ.46.3 కోట్లు రుణాలివ్వాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఇప్పటి వరకు రూ.38.8 కోట్లు పంపిణీ చేసి 83.88 శాతం లక్ష్యాన్ని సాధించారు. పూర్తి లక్ష్యాన్ని సాధించే దిశగా కృషి చేస్తున్నారు.

పీసీసీ అధ్యక్షుడు, మంత్రిని కలిసిన ఎమ్మెల్యే


మంత్రి కోమటిరెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్‌తో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు: ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్‌ను బుధవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గ రాజకీయాలతో పాటు అభివృద్ధి పనులపై చర్చించారు.

దౌల్తాబాద్, బొంరాస్‌పేట: కుదురుమల్లలో ఐదు పడకల ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయాలని గ్రామస్థులు మంత్రికి విన్నవించారు. బుధవారం గాంధీభవన్‌లో దామోదర్ రాజనర్సింహాను కలిసి విన్నవించారు.

ముస్తాబు చేశారు..



తాండూరు మండలం జిన్‌గుర్తి గేటు వద్ద రూ.25 లక్షలతో గోదాం, ప్లాట్‌ఫారం నిర్మించారు. గతేడాది రంగులు వేసి ముస్తాబు చేశారు. ఆర్నెల్లు దాటినా ప్రారంభోత్సవం చేయకుండా తాళం వేసి ఉంచారు. చెంతనే నిర్మించిన గోదాంను అందుబాటులోకి తీసుకురాకుండా నిరుపయోగంగా ఉంచడంపై రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ ఉత్పత్తులు నిల్వ ఉంచేందుకు వీలుగా వెంటనే వినియోగంలోకి తేవాలని డిమాండ్ చేస్తున్నారు.

తాళం వేశారు



ఎల్మకన్నెలో ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం భవనాన్ని రూ.10.62 లక్షలతో నిర్మించారు. గతేడాది అక్టోబరులో నేతలు ప్రారంభోత్సవం చేశారు. భవనాన్ని అందుబాటులోకి తీసుకురాకపోవడంతో వృథాగా మారింది. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పంచాయతీ కార్యాలయంలోని ఇరుకైన గదిలో సేవలందిస్తూ సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. వైద్య సేవలకు సొంత భవనం నిర్మించినా వినియోగంలోకి రాకపోవడంతో గ్రామస్థులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

– న్యూస్‌టుడే, తాండూరు గ్రామీణ.

3 నుంచి ప్రయోగ పరీక్షలు

వికారాబాద్ మున్సిపాలిటీ, న్యూస్‌టుడే: అంబేడ్కర్ విశ్వవిద్యాలయం బీఎస్సీ మొదటి, రెండో సంవత్సరం సెమిస్టర్ విద్యార్థులకు అక్టోబర్ 3 నుంచి ప్రయోగ పరీక్షలు ఉంటాయని ఎస్‌ఏపీ కళాశాల అధ్యయన కేంద్రం సమన్వయకర్త మల్లారెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. రోజూ హాజరైన విద్యార్థుల సంతకం తీసుకొంటామన్నారు. ప్రయోగ పరీక్షలకు అవసరమైన పరికరాలను తీసుకురావాలని సూచించారు.

పర్యావరణ పరిరక్షణపై అవగాహన అవసరం


మాట్లాడుతున్న సమన్వయకర్త లక్ష్మి

మోమిన్‌పేట, న్యూస్‌టుడే: విద్యార్థి దశ నుంచే పర్యావరణ పరిరక్షణ.. పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కలిగి ఉండాలని డీపీవో సంధ్యారాణి సూచించారు. బుధవారం స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా మండలంలోని మేకవనంపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులకు 'పరిసరాల పరిశుభ్రత.. మొక్కల పెంపకం'పై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రతి విద్యార్థి మొక్క నాటి సంరక్షించే బాధ్యత తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో విజయలక్ష్మి, ఎంపీవో యాదగిరి, ప్రధానోపాధ్యాయుడు గౌరీశంకర్, ఎస్‌బీఎం సమన్వయకర్త లక్ష్మి పాల్గొన్నారు.

పొంగిన వాగులు.. మునిగిన పంటలు


ఉద్ధృతంగా ప్రవహిస్తున్న కోట్‌పల్లి వాగు


పత్తి పంటలోకి చేరిన వరద

కోట్‌పల్లి, పెద్దేముల్: కోట్‌పల్లి మండలంలోని బర్వాద్, రాంపూర్, కరీంపూరు, ఎన్నారం, ఎన్కెపల్లి, మోత్కుపల్లి, కోట్‌పల్లిలో బుధవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. వరద నీటితో వాగులు పొంగిపొర్లాయి. పొలాల్లో వరద చేరి పంటలకు నష్టం వాటిల్లింది. సుమారు గంటపాటు కురిసిన వానకు ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

ఉత్పత్తి కేంద్రంపై మీనమేషాలు

న్యూస్‌టుడే, పరిగి



మత్స్య సంపద అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నా.. జిల్లాలో మాత్రం ముందడుగు పడడం లేదు. చేపలు అమ్మడమే ప్రధాన ఉపాధిగా ఎంచుకొని వేలాది కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. అలాంటి వారికి అండగా నిలిచేందుకు గతంలో మత్స్యశాఖ అధికారులు లఖ్నాపూర్ ప్రాజెక్టు వద్ద చేప పిల్లల ఉత్పత్తి కేంద్రం ఏర్పాటు చేస్తామన్నారు. దశాబ్దం గడిచినా ఇప్పటివరకు ఎలాంటి పురోగతి కనిపించడం లేదు. కేంద్రం ఏర్పాటుతోపాటు మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తే ఎంతో ప్రయోజనం కలుగుతుందని మత్స్యకారులు అంటున్నారు.

- మత్స్య సహకార సొసైటీలు: 148
- పురుషులవి: 141 ● మహిళలవి: 06
- మార్కెటింగ్ సొసైటీ: 01 ● సభ్యులు: 5,640
- మొత్తం జలవనరులు: 868
- అనుకూలమైనవి: 746
- చేప పిల్లల పెంపకం లక్ష్యం: 63 లక్షలు

సర్వేతోనే సరి..

పరిగి మండల కేంద్రానికి ఆరు కిలోమీటర్ల దూరంలో లఖ్నాపూర్ జలాశయం ఉంది. 18 అడుగుల లోతుతో 410 ఎకరాల విస్తీర్ణంలో విస్తరించింది. రెండు ప్రధాన కాల్వల కింద 2,647 ఎకరాల ఆయకట్టు కలిగి ఉంది. పదేళ్ల కిందట క్షేత్రస్థాయిలో సర్వే పూర్తి చేసిన అధికారులు అనుకూల పరిస్థితులున్నాయని అప్పట్లో ప్రభుత్వానికి నివేదిక అందించారు. ఇప్పటి వరకు అతీగతీ లేదు. స్థానికంగా ఏర్పాటు చేస్తే జిల్లాకు మణిహారంగా మారుతుందని పలువురు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో ఒక్కటే..: ప్రస్తుతానికి జిల్లాలోని మోమిన్‌పేట మండలంలో మాత్రమే చేప పిల్లల ఉత్పత్తి కేంద్రం ఉంది. ఇక్కడ 40 లక్షల ఉత్పత్తి సామర్థ్యం ఉండగా.. నిర్వహణ లోపంతోపాటు ఇతర కారణాలతో సగమైనా కావడం లేదు. జిల్లాలో ఈసారి వర్షాలు ఆలస్యం కావడంతో సగం మాత్రమే చేప పిల్లలను వదులుతున్నారు. పరిగి, వికారాబాద్, తాండూరు, కొడంగల్ పురపాలికల్లో ప్రత్యేక చేపల విక్రయాలకు మార్కెట్లు ఏర్పాటు చేయాలని భావించారు. ఆయా ప్రాంతాల్లో సమీకృత మార్కెట్ల నిర్మాణంతో అది మరుగున పడింది. అవీ పూర్తి కాకపోవడంతో రోడ్ల పక్కన విక్రయిస్తున్నారు.

అవకాశాలుంటే పరిశీలిస్తాం..

గతంలో సర్వే చేసిన విషయం మా దృష్టికి రాలేదు. లఖ్నాపూర్ ప్రాజెక్టు వద్ద అవకాశాలు అనుకూలంగా ఉంటే పరిశీలిస్తాం. ఈసారి 63 లక్షల చేప పిల్లల పెంపకం లక్ష్యంగా పెట్టుకున్నాం. త్వరలోనే ఈ ప్రక్రియ ప్రారంభం కానుంది.

– ఎం.వెంకయ్య, జిల్లా మత్స్యశాఖ అధికారి.

నేర పరిశోధనకు అన్ని అంశాలపై పట్టు: ఏఎస్పీ


వివిధ అంశాలపై పరీక్ష రాస్తున్న పోలీసులు

వికారాబాద్, న్యూస్‌టుడే: నేర పరిశోధనకు సంబంధించి నేరస్థల పరిశీలన, ఆధారాల సేకరణ, వేలిముద్రలు, వీడియోల చిత్రీకరణ తదితర అంశాలపై పట్టు సాధించాలని ఏఎస్పీ రవీందర్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లాస్థాయిలో పోలీసులకు మౌఖిక, రాత పరీక్షలు నిర్వహించి ప్రతిభను అంచనా వేశారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ.. ప్రతిభ కనబర్చిన పోలీసు అధికారులు, సిబ్బందిని జోనల్ స్థాయికి ఎంపిక చేస్తామన్నారు. తరవాత జోనల్ నుంచి రాష్ట్ర, జాతీయ స్థాయికి ఎంపికయ్యే అవకాశం ఉందన్నారు. డ్యూటీ మీట్ కార్యక్రమంతో నైపుణ్యాభివృద్ధి, నూతన చట్టాలపై అవగాహన పెంచుకోవచ్చన్నారు. డీసీఆర్బీ డీఎస్పీ జానయ్య, ఏఆర్ డీఎస్పీ వీరేశ్, డీసీఆర్బీ సీఐ అంజనేయులు, డా.నిఖిల పాల్గొన్నారు.

మణికంఠుడి పల్లకీ సేవ



తాండూరు గ్రామీణ, న్యూస్‌టుడే: పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయంలో బుధవారం మణికంఠుడి పల్లకీసేవను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గులాబీ, బంతిపూలతో అలంకరించిన స్వామివారిని ఆలయ ప్రాంగణంలో ఊరేగించారు. భక్తులు భజనలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కోకట్‌కు చెందిన కొరిడే హరీశ్‌రెడ్డి అన్నప్రసాద వితరణ చేశారు.

అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం అక్టోబరు 1న

వికారాబాద్ మున్సిపాలిటీ, న్యూస్‌టుడే: వచ్చే నెల 1న అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని నిర్వహించనున్నామని జిల్లా సంక్షేమాధికారిణి బి.కృష్ణవేణి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 25 నుంచి 1వ తేదీ వరకు వారోత్సవాలు జరుపుతామన్నారు. వృద్ధాశ్రమంలోని వయోవృద్ధులకు క్రీడాపోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. వయోవృద్ధుల సంక్షేమ చట్టాలు, టోల్‌ఫ్రీ నంబర్ 14567 గురించి అవగాహన కల్పిస్తామన్నారు. పలువురు పాల్గొన్నారు.

స్వయం ఉపాధి కోర్సుల్లో ఉచిత శిక్షణ

వికారాబాద్ మున్సిపాలిటీ, న్యూస్‌టుడే: భారతీయ స్టేట్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా చిల్కూరులో గ్రామీణ ప్రాంత యువతి, యువకులకు వివిధ కోర్సుల్లో శిక్షణ అందిస్తామని సంస్థ సంచాలకుడు కె.రమేశ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. అక్టోబర్ 5 నుంచి శిక్షణ ప్రారంభిస్తామన్నారు. శిక్షణ కాలంలో ఉచిత భోజనం, వసతి, యూనిఫాం, టూల్‌కిట్స్ పంపిణీ చేస్తామన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు కార్యాలయంలో లేదంటే 8500165190 ఫోన్ నంబరులో సంప్రదించాలని సూచించారు.

ఐటీఐలో మిగిలిన సీట్ల భర్తీకి చర్యలు

వికారాబాద్ మున్సిపాలిటీ, న్యూస్‌టుడే: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లోని ఐటీఐ కోర్సుల్లో 5వ విడత మిగిలిన సీట్లను భర్తీ చేస్తున్నామని ప్రిన్సిపల్ ఆర్.నరేంద్రబాబు బుధవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. కొత్తవారు ఈనెల 28లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. 10, 8వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులకు అవకాశం ఉందన్నారు. కొన్ని కోర్సులకు మాత్రమే 8వ తరగతి ఉత్తీర్ణులైన వారు అర్హులన్నారు. వివరాలను వెబ్‌సైట్‌లో పొందుపర్చామని తెలిపారు. ఇతర వివరాలకు 9177472488 ఫోన్ నంబరులో సంప్రదించాలని సూచించారు.

జలసిరులు

పంటలకు నీరందే అవకాశం

న్యూస్‌టుడే, తాండూరు


మత్తడి దూకుతున్న శివసాగర్ జలాశయం

జిల్లాలోని ప్రధాన జలాశయాలు నిండుకుండలను తలపిస్తున్నాయి. రెండేళ్ల కిందట వట్టిపోయి కనిపించగా.. ఇటీవల ఎగువన కురిసిన భారీ వర్షాలకు పూర్తిగా నిండాయి. యాసంగిలో వేరుసెనగ, ఇతర ఆరుతడి పంటలు సాగు చేసే ఆయకట్టు భూముల రైతుల్లో సంతోషం వ్యక్తమవుతోంది. అవసరాలనుబట్టి నీటి పారుదల శాఖ వానాకాలం పంటలకూ నీటిని విడుదల చేయనుంది.

23,927 ఎకరాల ఆయకట్టు..

జిల్లావ్యాప్తంగా 1,000- 9,200 ఎకరాల ఆయకట్టుకు నీరందించే జలాశయాలు 10 ఉన్నాయి. వాటి పరిధిలో 23,927 ఎకరాల ఆయకట్టు ఉంది. మండల కేంద్రం యాలాల సమీపంలోని శివసాగర్ జలాశయం మినహా మిగిలినవి నిర్ణీత ఆయకట్టులో కొంతభాగంలో సాగు చేసే ఆరుతడి పంటలకు నీరు అందించనున్నాయి. కాలువలు, తూములు, డిస్ట్రిబ్యూటరీలు మరమ్మతులకు గురి కావడంతో పూర్తి ఆయకట్టుకు నీరందించే పరిస్థితి లేదు. కోట్‌పల్లి, లక్నాపూరు, జుంటుపల్లి జలాశయాల నుంచి నీరు విడుదల చేసినప్పుడల్లా 5- 20 శాతం వృథాగా పోతోంది.

జలాశయం	నిల్వ సామర్థ్యం (అడుగుల్లో)	ప్రస్తుతం	ఆయకట్టు
కోట్‌పల్లి	24	24	9,200
జుంటుపల్లి	25	25	2,082
సర్పన్‌పల్లి	18	18	3,285
అల్లాపూరు	10	10	1,414
కొంశెట్‌పల్లి	08	08	1,073
నందివాగు	16	16	1,900
శివసాగర్	09	09	1,000
శ్రీరాములవారి ప్రాజెక్టు	10	10	1,000
లక్నాపూరు	18	18	2,647
కాకరవేణి వాగు	14.7	14.7	1,326

వేసవిలో మరమ్మతులు చేసే అవకాశమున్నా నిధుల్లేక పనులు కాలేదు.

అవసరాన్నిబట్టి విడుదల చేస్తాం..: సుందర్, నీటిపారుదల శాఖ ఈఈ, వికారాబాద్

ఆయకట్టు పొలాల్లో సాగయ్యే వరికి అవసరాన్నిబట్టి నీరు విడుదల చేస్తాం. యాసంగి సీజన్‌లోని ఆరుతడి పంటలకు అందిస్తాం. జలాశయాల కాలువలు, తూములు మరమ్మతులకు గురైన నేపథ్యంలో పూర్తి ఆయకట్టుకు వదిలే పరిస్థితి లేదు. మరమ్మతులకు రూ.కోట్లలో నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. ఒక్క కోట్‌పల్లి జలాశయానికే రూ.110 కోట్లు అవసరం. మిగిలిన వాటికి రూ.5-30 కోట్లు కావాలి. నిధులు వస్తే పనులు పూర్తి చేసి వచ్చే ఏడాది నిర్ణీత ఆయకట్టు భూములకు నీరందిస్తాం.

ఆలయాభివృద్ధికి సమష్టి కృషి

కొత్లాపూర్(తాండూరు గ్రామీణ): రేణుకా ఎల్లమ్మ ఆలయ అభివృద్ధికి గ్రామస్థులు, నాయకులు కలిసికట్టుగా ముందుకు రావాలని ఆలయ నిర్మాణకర్త, కర్ణాటక మాజీ మంత్రి అరవింద లింబావళి సూచించారు. కొత్లాపూర్‌లోని ఆలయాన్ని బుధవారం సందర్శించారు. అమ్మవారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. అభివృద్ధి పనులపై నాయకులు పట్లోళ్ల వెంకట్రాంరెడ్డి, ఆలయ మాజీ ఛైర్మన్ సందీప్‌రెడ్డి, మాజీ సర్పంచి సాయిలు, నవీన్‌రెడ్డి బృందంతో చర్చించారు. ప్రగతి పనులు, ప్రదేశాలను సూచించేందుకు తమిళనాడు రాష్ట్రం నుంచి అక్టోబరు 2న వాస్తుదోష పండితులు, గోపుర నిర్మాణ నిపుణుల బృందాన్ని ఆలయానికి రప్పిస్తున్నట్లు తెలిపారు.

ప్రతి కుటుంబానికి స్మార్టు కార్డు

వచ్చే నెల నుంచి సర్వే ● మంత్రి కొండా సురేఖ

సిద్దిపేట, న్యూస్‌టుడే: ప్రతి కుటుంబానికి ప్రత్యేకంగా ఫ్యామిలీ స్మార్ట్ (డిజిటల్) కార్డు అందించే దిశగా వచ్చే నెల నుంచి సర్వే మొదలవనుందని, రేషన్ కార్డులు అందించేందుకు అడుగులు పడనున్నాయని రాష్ట్ర పర్యావరణ, అటవీ, దేవాదాయ శాఖలు, సిద్దిపేట జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొండా సురేఖ తెలిపారు. ఒకే కార్డుపై ప్రభుత్వ పథకాలు అందే విధంగా ప్రభుత్వం శ్రీకారం చుట్టబోతుందన్నారు. సిద్దిపేట కలెక్టరేట్‌లో జిల్లా అభివృద్ధి-సంక్షేమ పథకాలపై బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఫ్యామిలీ కార్డు ద్వారా కుటుంబానికి సంబంధించి అన్ని వివరాలు తెలుసుకోవచ్చని, అనేక సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. పింఛను, రేషన్, హెల్త్ ప్రొఫైల్, ప్రభుత్వ పథకాలన్నింటికి ఉపయోగపడుతుందన్నారు. ఒకవేళ ఆసుపత్రికి వెళ్లినా ఆరోగ్య స్థాయి వివరాలు సులువుగా తెలుస్తాయని, చికిత్స సత్వరం అందుతుందన్నారు. ప్రజా పాలనలో తీసుకున్న దరఖాస్తుల్లో దాదాపు ఐదు అంశాలను అమలు చేసినట్లు తెలిపారు. నియోజకవర్గానికి 3500 చొప్పున ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని, మార్గదర్శకాలు రాగానే అమలు చేస్తామన్నారు. పర్యావరణ, ఆధ్యాత్మిక పర్యాటక అభివృద్ధిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధతో ఉన్నారని తెలిపారు. నిధుల లేమి సమస్య ఎక్కువగా ఉందని, విడుదలయిన వెంటనే పనులన్నీ పూర్తి చేస్తామన్నారు. సమావేశంలో సభ్యులు ప్రస్తావించిన అంశాలు కలెక్టర్ పరిధిలో ఉంటే త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో మెదక్ ఎంపీ రఘునందన్‌రావు, మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు, ఎమ్మెల్సీలు యాదవరెడ్డి, దేశపతి శ్రీనివాస్, దుబ్బాక, జనగామ, మానకొండూరు ఎమ్మెల్యేలు కొత్త ప్రభాకర్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, సత్యనారాయణ, ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య, కలెక్టర్ మనుచౌదరి, అధికారులు పాల్గొన్నారు.

బోధన భళా.. కొలువుల కళ

ఒకే కళాశాల నుంచి 87 మంది ఏఈఈలు



నీటిపారుదల శాఖలో ఉద్యోగాలకు ఎంపికైన కళాశాల విద్యార్థులు



న్యూస్‌టుడే, సంగారెడ్డి మున్సిపాలిటీ, సంగారెడ్డి టౌన్, కంది:

వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాల.. ఎన్నో ఆశలతో ఇక్కడ చదివారు. అధ్యాపకుల బోధన.. విద్యార్థులు కష్టపడి చదివారు. వీరిలో కొందరు వ్యవసాయ శాఖలో ఏఈవోలుగా పని చేస్తున్నా పెద్ద ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో ముందుకు సాగారు. నిరంతరం లక్ష్య సాధనకు కృషి చేశారు. కష్టపడి చదవడంతో వారికి ఇష్టమైన నీటి పారుదల శాఖలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఏఈఈ)గా ఉద్యోగాలు సాధించారు. రైతులకు మరింత సేవ చేసేందుకు తమకు అవకాశం దక్కిందని ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. కందిలోని వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థుల ఘనత.. నేడు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఉద్యోగ పత్రాలు అందుకోనున్నారు. ఈ నేపథ్యంలో 'న్యూస్‌టుడే' కథనం..

బ్యాంకు ఉద్యోగం మానేసి..

– శరత్‌చంద్ర



మాది మహబూబ్‌నగర్ జిల్లా. తల్లిదండ్రులు చంద్రశేఖర్- పోచమ్మ. వ్యవసాయం చేస్తూ చదివించారు. నేను ఎంబీఏ చదివి హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో ఉద్యోగం చేశా. నాన్న కోరిక మేరకు వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాలలో చేరా. ఆశించిన నీటిపారుదల శాఖలో ఏఈఈ పోస్టుకు ఎంపికయ్యాను.

నాణ్యతతో సుసాధ్యం

కందిలోని వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాల ప్రత్యేకతను సంతరించుకుంది. ఇక్కడ చదివిన 87 మంది నీటి పారుదల శాఖలో ఏఈఈ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. రాష్ట్రంలోనే అత్యధిక మంది ఒకేసారి ఎంపికైన ఘనతను కళాశాల దక్కించుకుంది. గతంలో అధ్యాపకుల పోస్టులు ఖాళీగా ఉండటంతో విద్యార్థులు చదువుల్లో వెనకబడ్డారు. మూడేళ్ల క్రితం వివిధ రూపాల్లో నిరసనలు చేపట్టి అధ్యాపక పోస్టులు భర్తీ చేయించుకున్నారు. నిష్ణాతులైన అధ్యాపక బృందం.. నాణ్యమైన బోధనే విద్యార్థులు ఉద్యోగాలు దక్కించుకునేందుకు దోహద పడ్డాయి. వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాలలో చదివితే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని నిరూపించారు. భవిష్యత్‌లో ఈ కళాశాలలో చేరే విద్యార్థులకు దిక్సూచిగా నిలిచారు.

లక్ష్య సాధనకు కృషి

– మాన్యరెడ్డి



మాది మిర్యాలగూడ మండలం లక్ష్మీపురం. తండ్రి వాసురెడ్డి, వ్యవసాయ కుటుంబం మాది. వ్యవసాయ విస్తరణ అధికారిగా పని చేస్తూనే ఇక్కడ వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాలలో చదివా. వ్యవసాయంలో రైతులకు కొత్త పద్ధతులకు సంబంధించి సూచనలు సలహాలు ఇచ్చేదాన్ని. ఉన్నత ఉద్యోగం సాధించాలన్న లక్ష్యంతో ప్రణాళికతో చదివా.

అమ్మానాన్నల ఆశయం

– భవాని



మాది సూర్యాపేట. మా తల్లిదండ్రులు గురుమూర్తి- పద్మావతి. ప్రభుత్వ ఉద్యోగం రావాలన్న అమ్మానాన్నల కోరిక. చిన్నతనం నుంచి కష్టపడి చదివించారు. వారి ఆశయ సాధనను నిరంతరం గుర్తు చేసుకునేదాన్ని. అధ్యాపకులు సందేహాలు ఎప్పటికప్పుడు నివృత్తి చేసేవారు. చదువు పూర్తి కాగానే ఏఈఈ ఉద్యోగం రావడం ఆనందంగా ఉంది.

ఆర్ద్రా మహోత్సవ వైభవం



కొండపాక గ్రామీణం, న్యూస్‌టుడే: సిద్దిపేట జిల్లా కొండపాక మండలం మర్పడ్గలోని విజయదుర్గా సమేత సంతాన మల్లికార్జున స్వామి క్షేత్రంలో బుధవారం ఆర్ద్రా మహోత్సవం వైభవంగా జరిగింది. క్షేత్ర నిర్వాహకుడు చెప్పెల హరినాథశర్మ, వైదికుల పర్యవేక్షణలో గణపతి పూజ, పాశుపత అభిషేకం, విశేషార్చన, హోమం, పూర్ణాహుతి జరిగాయి. భక్తులు విజయదుర్గను దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

28న ఉమ్మడి జిల్లా అథ్లెటిక్స్ ఎంపికలు

సంగారెడ్డి మున్సిపాలిటీ, న్యూస్‌టుడే: పాఠశాల క్రీడా సమాఖ్య(ఇంటర్మీడియట్) ఆధ్వర్యంలో ఈ నెల 28న మెదక్‌లోని ఇందిరా గాంధీ మైదానంలో ఉమ్మడి జిల్లా అథ్లెటిక్స్ అండర్-19 ఎంపికలు నిర్వహిస్తామని జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి గణపతి ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు పదో తరగతి మెమో, బోనఫైడ్, జనన ధ్రువీకరణపత్రం, ఆధార్ కార్డుతో ఉదయం 9 గంటలకు హాజరు కావాలని కోరారు.

స్వచ్ఛ ఆకృతి.. స్ఫూర్తి



స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా సిద్దిపేటలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలోని ఫుట్‌బాల్ మైదానంలో విద్యార్థినులు 'ఎస్‌హెచ్‌ఎస్' అక్షరాల ఆకృతిలో బుధవారం ప్రదర్శన చేపట్టారు. 40 మీటర్ల పొడవు, 20 మీటర్ల వెడల్పు ఉన్న ఈ మైదానంలో మొత్తం 500 మంది విద్యార్థినులు కేవలం 40 నిమిషాల్లో క్రమశిక్షణగా ప్రదర్శనలో కూర్చున్నారు. అంతకు ముందు వారు శ్రమదానం చేశారు. పారిశుద్ధ్య పర్యవేక్షకురాలు వనిత ఆధ్వర్యంలో ప్రతిజ్ఞ చేశారు. చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్నారు. ప్రధానోపాధ్యాయుడు మనోహర్ తదితరులు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, సిద్దిపేట టౌన్

చారిత్రక ప్రదేశాలే సంపద

సంగారెడ్డి టౌన్, న్యూస్‌టుడే: చారిత్రక ప్రదేశాలు, సాంస్కృతిక వారసత్వమే తరగని సంపద అని సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ కళాశాల వైస్ ప్రిన్సిపల్ జగదీశ్వర్ అన్నారు. కళాశాల యువ, పర్యాటక క్లబ్, చరిత్ర విభాగాల ఆధ్వర్యంలో విద్యార్థులకు వివిధ పోటీలు బుధవారం నిర్వహించారని చెప్పారు. 'నాకు నచ్చిన పర్యాటక ప్రదేశం' అంశంపై వ్యాస రచన పోటీలు నిర్వహించారు. 'పర్యాటక రంగ అభివృద్ధిలో యువత పాత్ర' అంశంపై ఉపన్యాసం, 'పర్యావరణహిత సుస్థిర పర్యాటక రంగం' అంశంపై పోస్టర్ పెయింటింగ్ పోటీలు ఏర్పాటు చేశారు.

విలువ పెంచే మూలాలు

మూలాలను మరిచిపోయి ఎంతగా ఎదిగినా జీవితాన్ని మోసపుచ్చినట్టే లెక్క... ప్రముఖులు యువతకు సూచించే విషయమిది. ప్రభుత్వ ఉద్యోగాలు సాధించినా, ఇతర రంగాల్లో స్థిరపడినా కొందరు అంతకు ముందు తాము ఏ విధులు నిర్వర్తించే వారో మరచిపోకుండా తరచుగా వాటిని చేపడుతుంటారు. నైపుణ్యం చెక్కుచెదరకుండా చూసుకుంటారు. ఈ కోవలోనే వృత్తి, ప్రవృత్తులతో ముందడుగు వేస్తున్న కొందరి జీవన గమనంపై 'న్యూస్‌టుడే' కథనం.

వడ్రంగి.. నైపుణ్యమండీ



పరికరాలు తయారు చేస్తున్న కృష్ణ

కొడంగల్, న్యూస్‌టుడే: వికారాబాద్ జిల్లా కొడంగల్ మండలం ఇందనూర్ గ్రామానికి చెందిన వడ్ల ముద్దప్ప, లక్ష్మమ్మ దంపతుల కుమారుడు వడ్ల కృష్ణ. ఎంఏ, డీఈడీ చేసి ప్రస్తుతం బాలాజీ కేజీ ఉన్నత పాఠశాలలో సాంఘిక శాస్త్రం బోధిస్తున్నారు. తాత బాలప్ప, తండ్రి ముద్దప్ప వద్ద కృష్ణ వడ్రంగి పనులను చిన్నప్పుడు నేర్చుకున్నారు. నాగలి, గొర్రు, గుంటుక వంటి వ్యవసాయ పరికరాలను తయారు చేయడం, సీజన్‌లో మరమ్మతులు చేస్తున్నారు. జొన్నలు, వడ్లు, ఇతర పంటలను రైతులు కృష్ణ కుటుంబానికి అందిస్తారు.

వారసత్వ ఇస్త్రీ

తాండూరు టౌన్: వాళ్లు ముగ్గురు అన్నదమ్ములు.. ప్రభుత్వ ఉపాధ్యాయులు. కుల వృత్తి స్ఫూర్తితోనే తాము ఉపాధ్యాయులుగా ఎదిగామని నమ్మి పనిని కొనసాగిస్తున్నారు. వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణానికి చెందిన రమేశ్.. యాలాలలోని ప్రభుత్వ పాఠశాలలో, రాజేశ్.. హాజీపూర్‌లో, శ్రీనివాస్.. పెద్దేముల్ మండలం మంబాపూరులో ఉపాధ్యాయులుగా బోధిస్తున్నారు. సాయంత్రం పాఠశాల సమయం పూర్తి కాగానే ముగ్గురూ తమ ఇళ్ల వద్ద ఇతరుల దుస్తులను ఇస్త్రీ చేస్తున్నారు. ఎంత ఎదిగినా భేషజానికి పోకుండా వారసత్వంగా వృత్తి నైపుణ్యాలు ఉంటే జీవితం సంతృప్తిగా ఉంటుందని వారు తెలిపారు.



శ్రీనివాస్



రమేశ్



రాజేశ్

ఆదాయం మెరుగు పరిచే బజ్జీ



బజ్జీలు వేస్తున్న కృష్ణ

తాండూరు: వికారాబాద్ జిల్లా పెద్దేముల్ గ్రంథాలయ సహాయకుడు కృష్ణ రోజూ విధులు ముగియగానే అదనపు సంపాదనకు బజ్జీలు వేస్తూ విక్రయిస్తున్నారు. వారు ఐదుగురు కుటుంబ సభ్యులు. 2009లో పొరుగుసేవల విధానంలో ఉద్యోగంలో చేరారు. రాత్రి 7 గంటల వరకు విధుల్లో ఉంటారు. తర్వాత 12 కి.మీ. దూరంలోని తాండూరులో రాత్రి 8 గంటల నుంచి బజ్జీల విక్రయ దుకాణం తెరుస్తారు. బజ్జీల విక్రయంతో ఆదాయం చేదోడుగా ఉంటోందని తెలిపారు.

ఆధ్యాత్మికం.. పరవశం



శ్రీశైలంలో పాల్గొన్న భక్తులు

న్యూస్‌టుడే, దోమ: 'ఏ తీరుగ నను దయ చూసెదవో ఇనవంశోత్తమ రామా..', 'శివ శివ యనరాదా మనసా..' ఇలా దేవాలయాలు, మఠాల్లో భజనలు భక్తితత్పరతతో మార్మోగుతుంటాయి. కీర్తనలను, పాటలను పాడటానికి కొన్ని ప్రాంతాల్లో ప్రత్యేకంగా భజన మండళ్లు ఉన్నాయి. వివిధ గ్రామాల్లోని గుళ్లలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపడతారు. అక్కడ రాకమచర్ల కీర్తనలు, భక్త తుకారం, రామాయణం, పాండురంగడి భజనలు, తత్వాలు పాడతారు. సాధారణంగా పుణ్యదినాలు, పండుగలు, శని, ఆది, సోమవారాల్లో కార్యక్రమాలు ఉంటాయి. వికారాబాద్ జిల్లా దోమ మండల పాలేపల్లికి చెందిన శ్రీరామాంజనేయ భజన మండలి భక్తులు పూర్వీకుల నుంచి ఈ ఆచారాన్ని అనుసరిస్తున్నారు. యువతను సన్మార్గంలో నడిపించేందుకు ఆధ్యాత్మిక పాటలు, పద్యాలు, పండగలపై ప్రవచనాలను సాధన చేయిస్తున్నారు. వీరి ప్రతిభను గుర్తించి జిల్లాలోని తాండూరు భద్రేశ్వరస్వామి, కొడంగల్ శ్రీనివాసుని బ్రహ్మోత్సవాలు, చేవెళ్లలోని శంకరమ్మ మాత, వికారాబాద్‌లోని బుగ్గరామేశ్వరం, కుల్కచర్ల మండలం ఏకశిల పర్వత ఉత్సవాల సందర్భంగా మండలి భక్తులను ఆహ్వానిస్తారు. గత వారం శ్రీశైల దేవస్థానం నుంచి ఆహ్వానం అందుకున్నారు. అక్కడ తమ భజన సంకీర్తనల ప్రతిభను చాటుకున్నారు. గతేడాది స్వర్గీయ కొండా మాధవరెడ్డి స్మారకార్థం భజన పోటీల్లో పాల్గొని ప్రథమ స్థానం దక్కించుకున్నారు. గ్రామంలో వీరితో పాటు సీతారామచంద్ర మహిళ భజన మండలి కూడా ఉంది.



చంద్రశేఖరాచార్యులను సన్మానిస్తున్న రేగోడ్ మఠం బాధ్యులు

సనాతన ధర్మాన్ని కాపాడాలి

రేగోడ్: హిందూ సనాతన ధర్మాన్ని, ఆలయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి హిందువుపై ఉందని కడప జిల్లా కందిమల్లయ్యపల్లిలోని వీరబ్రహ్మం సంస్కృత వేద పాఠశాల ప్రధానాచార్యుడు చంద్రశేఖరాచార్యులు అన్నారు. మెదక్ జిల్లా రేగోడ్‌లోని బ్రహ్మంగారి మఠాన్ని బుధవారం సందర్శించి పూజలు చేశారు. ఆయన మాట్లాడుతూ దేవాలయాల్లో ఘటనలు, దాడులను తీవ్రంగా పరిగణించి నిందితులపై చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం బ్రహ్మంగారి మఠం కమిటీ సభ్యులు ఆయనను ఘనంగా సత్కరించారు.

వేర్వేరు చోట్ల ముగ్గురి ఆత్మహత్య

ప్రేమించిన అమ్మాయి దక్కదని యువకుడు..



అనిల్ కుమార్

ములుగు, న్యూస్‌టుడే: వారిద్దరు ప్రేమించుకున్నారు. పెద్దలను ఒప్పించి పెళ్లి చేసుకోవాలనుకున్నారు. విషయం అమ్మాయి మేనమామలకు తెలియడంతో వారు పెళ్లికి నిరాకరించారు. కోరుకున్న అమ్మాయి దక్కదని భావించిన ఆ యువకుడు పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. సిద్దిపేట జిల్లా మర్కూక్ ఎస్‌ఐ దామోదర్ తెలిపిన వివరాలు.. మర్కూక్ మండలం పాతూరు గ్రామానికి చెందిన అనిల్‌కుమార్(19) హైదరాబాద్‌కు చెందిన ఓ యువతిని ప్రేమించాడు. ఆ యువతి అతడి కంటే ఏడాది పెద్దది. ఆమె అమ్మమ్మగారిల్లు కూడా పాతూరే. గతేడాది ఆమె ఇక్కడికి వచ్చినప్పుడు అనిల్ కుమార్‌తో పరిచయం ఏర్పడి అది కాస్త ప్రేమగా మారింది. పెద్దలతో మాట్లాడి పెళ్లి చేసుకుందామని ప్రేమికులిద్దరూ నిర్ణయించుకున్నారు. ఇదే విషయాన్ని యువకుడి తండ్రి కిష్టయ్య అమ్మాయి మేనమామల దృష్టికి తీసుకెళ్లగా వారు నిరాకరించారు. విషయం ఇంతటితో వదిలి పెట్టాలని, అమ్మాయి జోలికి మళ్లీ రాకూడదని మందలించారు. ప్రేమించిన అమ్మాయి దక్కదని తెలుసుకున్న అనిల్ కుమార్ ఆదివారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు వెంటనే ములుగు మండలం లక్ష్మక్కపల్లిలోని ఆర్వీఎం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. తన కొడుకు మృతికి అమ్మాయి మేనమామలు కారణమంటూ అనిల్ కుమార్ తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మద్యానికి బానిసై డ్రైవర్..



పరశు రాములు

కొండపాక గ్రామీణం, న్యూస్‌టుడే: మద్యానికి బానిసై కొండపాక మండలం అంకిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన తాళ్లపల్లి పరశురాములు(40) పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాలు.. పరశురాములు వృత్తిరీత్యా డ్రైవర్. ఏడాదిగా మద్యానికి బానిసై ఏ పని చేయకుండా ఖాళీగా తిరుగుతున్నాడు. 20 రోజుల క్రితం మద్యం తాగి ఇంటికొచ్చి భార్య వాణితో వాగ్వాదానికి దిగడంతో ఆమె తన పుట్టింటికి(జప్తినాచారం) వెళ్లారు. మనస్తాపానికి గురై బుధవారం తన వ్యవసాయ బావి వద్ద ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన స్థానికులు అతడిని వెంటనే చికిత్స నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

కుటుంబ సమస్యలతో కార్మికుడు..



నాగరాజు

దుబ్బాక, న్యూస్‌టుడే: ఒంటికి నిప్పంటించుకుని దుబ్బాక పట్టణానికి చెందిన బెల్లె నాగరాజు(45) ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు తెలిపిన వివరాలు.. నాగరాజు వెల్డింగ్ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. భార్య సునీత, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కొంత కాలంగా ఆర్థికంగా ఇబ్బందులు పడుతూ కుటుంబ సభ్యులతో గొడవలు పడుతున్నట్లు సమాచారం. ఈ క్రమంలోనే మంగళవారం రాత్రి ఒంటిపై కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. మంటలకు తాళలేక కేకలు వేయడంతో వెంటనే కుటుంబ సభ్యులు అప్రమత్తమై మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. 108 వాహనంలో సిద్దిపేటకు, అక్కడ్నుంచి సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మధ్యాహ్నం మృతి చెందాడు. ఈ ఘటనపై దుబ్బాక ఎస్సై గంగరాజును వివరణ కోరగా ఫిర్యాదు అందలేదని తెలిపారు.

ద్విచక్ర వాహనం ఢీకొని మహిళ దుర్మరణం

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో మహిళ మృతిచెందిన ఘటన సిద్దిపేటలో చోటు చేసుకుంది. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాలు... పట్టణంలోని రేణుకానగర్‌కు చెందిన కూచన్ మహేశ్వరి (50) ప్రధాన రహదారి బుధవారం డివైడర్ దాటుతుండగా వేములవాడ కమాన్ వైపు ఓ యుకువడు ద్విచక్రవాహనంపై వస్తూ ఆమెను వెనుక నుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఆమెకు తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం స్థానికులు ప్రభుత్వం జనరల్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మహేశ్వరి మృతిచెందింది. కుమారుడు భానుప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు.

పిడుగుపాటుతో ఒకరి మృతి



జాటి పటేల్

గుమ్మడిదల, న్యూస్‌టుడే: పిడుగుపడి ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం అన్నారం పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై మహేశ్వర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. అన్నారానికి చెందిన కుమ్మరి అశోక్ వద్ద ఒడిశా రాష్ట్రం నవాపాడ జిల్లా గోడల్ గ్రామానికి చెందిన జాటి పటేల్(36) మూడు నెలలుగా వ్యవసాయ పనులు చేస్తున్నాడు. 24వ తేదీన ఆయన గేదెలు మేపడానికి పొలానికి వెళ్లారు. సాయంత్రం ఉరుములు మెరుపులతో కూడిన వర్షం పడింది. రాత్రయినా జాటి పటేల్ ఇంటికి రాకపోవడంతో యజమాని అశోక్ చరవాణిని సంప్రదించగా ఎత్తలేదు. గేదెలు మాత్రం ఇంటికి వచ్చాయి. పొలం వద్దకు వెళ్లి వెతికినా ఆచూకి లభించలేదు. బుధవారం ఉదయం మళ్లీ వెళ్లి చూడగా డంప్‌యార్డు వద్ద విగత జీవిగా పడి ఉన్నాడు. పిడుగుపాటుతో మృతిచెందినట్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నిరీక్షణకు తెర

గిరిజన గురుకుల డిగ్రీ ప్రవేశాలకు ఆహ్వానం

న్యూస్‌టుడే, సంగారెడ్డి టౌన్:

గిరిజనులను పేదరికం నుంచి గట్టెక్కించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పలు పథకాలు, కార్యక్రమాలు అమలు చేస్తోంది. ఇందులో భాగంగా సంగారెడ్డిలో నాలుగేళ్ల కిందట గిరిజన గురుకుల డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేశారు. ఇక్కడ సొంత భవనం లేకపోవడంతో రెండేళ్ల క్రితం పటాన్‌చెరు మండలం పెద్దకంజర్ల శివారులోని ఓ ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలకు తరలించారు. రెండు సంవత్సరాలుగా ప్రవేశాల ప్రక్రియను నిలిపివేసింది. తాజాగా ప్రభుత్వం ప్రవేశాలకు అనుమతించిన నేపథ్యంలో కథనం. రెండు సంవత్సరాలుగా ప్రవేశాలు లేకపోవడంతో ఈ విద్యా సంవత్సరం ఉంటాయో లేవో తెలియని పరిస్థితి. చాలామంది విద్యార్థులు ఇతర కళాశాలలో ఇప్పటికే చేరారు. ప్రవేశాలకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో గిరిజన విద్యార్థులకు ఏం చేయాలో తెలియని పరిస్థితి నెలకొంది. ఈనెల 27 లోగా ప్రవేశాలు పొందాలని సూచించడమే దీనికి కారణం. దరఖాస్తులకు మూడు రోజుల సమయం మాత్రమే ఇచ్చారు. గడువు తేదీని పెంచాలని విజ్ఞప్తి చేశారు. ఈ కాలేజీలోని నాలుగు కోర్సుల్లో మొత్తం 240 సీట్లు ఉన్నాయి.



సద్వినియోగం చేసుకోవాలి

– మహేశ్వరి, ప్రిన్సిపల్

గురుకుల డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు ప్రభుత్వం అవకాశం కల్పించిన నేపథ్యంలో విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. గిరిజన గురుకులంలో డిగ్రీ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుంది. వివరాలకు 96422 86686, 97059 92496, 80080 70959 ఫోన్లలో సంప్రదించాలి.


కోర్సులు: ● బీఎస్సీ (ఫిజికల్ సైన్స్) ● బీఎస్సీ (లైఫ్ సైన్సెస్) ● బీకాం (సీఏ) ● బీకాం (ఆనర్)

ప్రత్యేకతలు:

- గిరిజనులకు ఉమ్మడి మెదక్ జిల్లాలో ఏకైక గురుకుల డిగ్రీ కళాశాల ఇది
- ఎన్.సి.సి., ఎన్.ఎస్.ఎస్ ఉన్నాయి.
- క్రీడల్లో ప్రోత్సాహం
- వైఫై సదుపాయంతో కంప్యూటర్ ల్యాబ్
- డిజిటల్ గ్రంథాలయం
- ఉచిత వసతి, నాణ్యమైన భోజనం

నారింజ వాగులో వ్యక్తి గల్లంతు!

వాహనంతో ప్రవాహం దాటుతుండగా ప్రమాదం



వాగులో కొట్టుకుపోతున్న ఇస్మాయిల్, (వృత్తంలో) షాకీర్

జహీరాబాద్ అర్బన్, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనంతో వాగు దాటుతూ వరద ఉద్ధృతికి వ్యక్తి గల్లంతవగా మరొకరు నీటిలో కొట్టుకుపోతూ చెట్ల కొమ్మలు పట్టుకుని ప్రాణాలు కాపాడుకున్నారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలంలో బుధవారం కురిసిన భారీ వర్షానికి బూచినెల్లి వద్ద నారింజ వాగు పొంగింది. కర్ణాటకలోని బీదర్ పట్టణ శివారులోని మైలూరుకు చెందిన షాకీర్(40) ద్విచక్ర వాహనంపై ఆయన ఇంటి పక్కన ఉండే ఇస్మాయిల్(60)తో కలిసి జహీరాబాద్ వైపు వస్తున్నారు.

ఇస్మాయిల్‌ను రక్షించిన గ్రామస్థులు

బూచినెల్లి సమీపంలోకి రాగానే నారింజ వాగు వంతెన మీదుగా పారుతున్న వరద ఉద్ధృతిని అంచనా వేయకుండా వాహనాన్ని ముందుకు పోనిచ్చాడు. మధ్యలోకి రాగానే ద్విచక్రవాహనం అదుపు తప్పడంతో షాకీర్ నీటిలో కొట్టుకుపోగా... ఇస్మాయిల్ పక్కనే చెట్లకొమ్మలు పట్టుకుని ప్రాణాలు కాపాడుకున్నాడు. వాగులో చెట్లకొమ్మలు పట్టుకుని నీళ్లలో ఉన్న ఇస్మాయిల్‌ను గ్రామస్థులు గుర్తించి రక్షించారు. వ్యక్తి గల్లంతు విషయం తెలుసుకున్న జహీరాబాద్ తహసీల్దార్ రవీందర్, ఎంపీడీవో మహేందర్‌రెడ్డి, ఆర్ఐ రుక్మొద్దీన్ ఘటనా స్థలాన్ని సందర్శించారు. ఘనపూర్-జహీరాబాద్ మార్గంలో రాకపోకలు నిషేధించారు.

నకిలీ అల్లం, వెల్లుల్లి తయారీ ముఠా పట్టివేత



పట్టుబడిన నిందితులతో పోలీసులు

కుల్కచర్ల: కల్తీ అల్లం, వెల్లుల్లి తయారీ ముఠాను టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకొని 9 క్వింటాళ్ల 38 కిలోల అల్లం, వెల్లుల్లి పేస్ట్, 2 క్వింటాళ్ల వెల్లుల్లిని స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై అన్వేష్‌రెడ్డి తెలిపిన వివరాలు.. టాస్క్‌ఫోర్స్ పోలీసులకు అందిన సమాచారం మేరకు మంగళవారం చౌడాపూర్ మండల కేంద్రంలో శశిధర్ కిరాణ దుకాణాన్ని తనిఖీ చేశారు. అక్కడ నకిలీ అల్లం, వెల్లుల్లి డబ్బాలు లభించాయి. శశిధర్‌ను విచారించగా.. మహబూబ్‌నగర్‌కు చెందిన బాలకృష్ణ, వెంకటేశ్వర్లు నుంచి కొన్నట్లు తెలిపారు. వారికి కీసర మండల కేంద్రానికి చెందిన దామోదర్‌రెడ్డి సరఫరా చేసినట్లు తేలింది. దామోదర్‌రెడ్డి హైదరాబాదులో ముకుంద జింజర్, గార్లిక్ పేస్ట్ ఇండస్ట్రీని నడుపుతున్నాడు. అందులోనే సిట్రిక్ యాసిడ్, ఎసిటిక్ యాసిడ్, టెస్టింగ్ సాల్ట్‌లతోపాటు కుళ్లిపోయిన వెల్లుల్లి లభించాయి. నిందితులపై కేసు నమోదైంది.

చికెన్ ధరలు			
ఫాంరేటు	125–00	డ్రెస్డ్	213–00
రిటైల్	147–00	స్కిన్‌లెస్	243–00

బిల్లుల సాధనకు నిరసన నేడు

పరిగి గ్రామీణ, న్యూస్‌టుడే: మన ఊరు మనబడి పనులు పూర్తైనా బిల్లులు రాలేదు. వాటిని వెంటనే ఇవ్వాలంటూ.. గురువారం ఉదయం పరిగి బస్టాండు ఎదుట నిరసన కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు పరిగి నియోజకవర్గ పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు రామేందర్ ఓ ప్రకటనలో తెలిపారు. గత ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామస్థాయిలో పార్టీలకు అతీతంగా పనులు పూర్తిచేశారని పేర్కొన్నారు.

నాపరాయి గనుల్లో కొలతలు వాయిదా

ఓగీపూర్(తాండూరుగ్రామీణ): ఓగీపూర్‌లోని సర్వే సంఖ్య 65లో నాపరాయి గనుల్లో బుధవారం నిర్వహించాల్సిన రెవెన్యూ, గనుల భూగర్భ వనరుల శాఖ సంయుక్త కొలతలను అధికారులు వాయిదా వేశారు. వర్షం పడే అవకాశమున్నందున కొలతలు చేయలేదన్నారు. త్వరలో మరోసారి తేదీ ఖరారు చేసి నిర్వహిస్తామన్నారు.

స్వచ్ఛంద సేవలను సద్వినియోగం చేసుకోండి

పూడూరు: స్వచ్ఛంద సంస్థ సేవలను సద్వినియోగం చేసుకోవాలని పరిగి మాజీ జడ్పీటీసీ సభ్యుడు చంద్రయ్య అన్నారు. గ్రీన్‌పోల్ ఫౌండేషన్ సహకారంతో అంకిత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బుధవారం మేడిపల్లికలాన్ పాఠశాలలో విద్యార్థులకు బ్యాగులు, మ్యాట్లు, పాఠ్యపుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు.

రాజీమార్గమే రాజమార్గం

దౌల్తాబాద్, న్యూస్‌టుడే: రాజీమార్గమే రాజమార్గమని ఎస్సై రవిగౌడ్ అన్నారు. ఈనెల 28న కొడంగల్‌లో లోక్‌అదాలత్ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. గ్రామాల్లో పలు గొడవల్లో కేసులతో సతమతమవుతున్న అర్జీదారులు రాజీ మార్గం కోసం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

విరిగిపడ్డ మట్టిదిబ్బ.. ఇంటి రేలింగ్ ధ్వంసం

పూడూరు, న్యూస్‌టుడే: గుట్టపై నుంచి మట్టిదిబ్బ విరిగిపడి ప్రమాదం తప్పింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పూడూరు మండలం చీలాపూర్ ప్రాథమిక పాఠశాల వెనకవైపు కాలనీలో చోటుచేసుకుంది, పక్కనే గుట్ట ఉండటంతో ఇటీవల కురిసిన వర్షాలకు ఎర్రమట్టిదిబ్బ బుధవారం ఉదయం ఒక్కసారిగా కింద పడింది. దీంతో వడ్డె తులసమ్మ కొత్తగా నిర్మిస్తున్న ఇంటి రేలింగ్‌కు తాకటంతో కొంత భాగం దెబ్బతిన్నట్లు తెలిపారు. ఆ సమయంలో ఇంట్లో ఎవరు లేకపోవటంతో ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు.

ఆరేళ్లుగా.. అభివృద్ధి ఏదీ?

కొడంగల్ పురపాలికలో దుస్థితి

న్యూస్‌టుడే, కొడంగల్ (బొంరాస్‌పేట):

పట్టణంలో సమస్యలు స్థానికులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ఈగలు, దోమలతో పాటు ఇళ్ల మధ్య నిలిచిన వాన నీటితో కష్టాలు తప్పడం లేదు. కాలనీల్లో పిల్లలు, వృద్ధులు రోగాల బారిన పడుతున్నారు. పురపాలిక ఏర్పడి దాదాపు ఆరేళ్లవుతున్నా.. అభివృద్ధి అంతంత మాత్రంగానే ఉందనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.



శాంతినగర్‌లో ఇళ్ల మధ్య నిలిచిన మురుగు

సమస్యలు ఇలా..

- శాంతినగర్ కాలనీలో వాటర్ ప్లాంటు నుంచి బీటీ రోడ్డుకు మధ్యలో సీసీ రోడ్డు వేశారు. ఒక వైపుమురుగు కాలువ నిర్మాణం చేశారు. మరో వైపు ఇళ్లలోని మురుగునీరు ఇళ్లమధ్యలో ఉన్న ఖాళీ స్థలంలో నిలిచి దుర్గంధం వస్తుంది. ఈ ప్రాంతం దోమలకు ఆవాసంగా తయారైంది.
- ఇంద్రగన్‌కాలనీలో మిషన్ భగీరథ పైపులైన్ కోసం సీసీ రోడ్లు తవ్వి వదిలేశారు. సీసీ రోడ్డును సరిచేయకపోవడంతో గుంతలమయంగా తయారైంది. ఈ కాలనీలోని అనుబంధ రోడ్లు వేయకపోవడంతో ఆ మార్గంలో పొదలు, మురుగునీరు నిలవడంతో కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపల్ అధికారులు ఫాగింగ్ యంత్రాలతో దోమల నివారణ చర్యలు చేపట్టడం లేదు.
- బాలాజీనగర్ కాలనీలో హనుమాన్ దేవాలయం వద్ద రోడ్డు పూర్తిగా ధ్వంసం అయ్యింది. మైసౌన్ కోసం తవ్వి వదిలేయడంతో గుంతలుగా తయారైంది.
- సనసిటీ కాలనీలో ఇళ్ల ఖాళీ ప్లాట్లలో మధ్య పొదలు పెరగడంతో ఇబ్బందిరకంగా ఉంది.
- బాకారంవీధిలో మాజీ ఎమ్మెల్యే సీసీ రోడ్డు పనులకు భూమిపూజ చేసిన నేటికీ పనులు ప్రారంభం కాలేదు. రోడ్డు, మురుగు కాలువల పనులు పెండింగ్‌లో ఉన్నాయి.
- వీధికుక్కలు రోడ్లపై ఎక్కువగా తిరుగుతూ.. పిల్లలు, వృద్ధులపై దాడి చేస్తున్నాయి. వాటిని కట్టడి చేయాలని స్థానికులు కోరుతున్నారు.
- వర్షాకాలంలో ఎక్కడ నీరు మలిచినా మురుగునీరు చేరుతుంది. పందులు ఎక్కువగా మురుగులో తిరగడంతో బురదయంగా దారులు మారుతున్నాయి.

ఒక్కొక్కటిగా పరిష్కరిస్తాం

– బలరాంనాయక్, మున్సిపల్ కమిషనర్, కొడంగల్

ఇప్పటికే కొన్ని ప్రదేశాల్లో సీసీ రోడ్లు పూర్తిచేశాం. అత్యవసర పనులు ఎక్కడ ఉన్నాయో గుర్తించడం జరిగింది. ఆ పనులు త్వరగా చేపట్టేందుకు ప్రయత్నిస్తున్నాం. ఇళ్ల మధ్య నిలిచి నీటిపై దోమల నివారణ మందును పిచికారీ చేయిస్తాం. పందుల కట్టడికి చర్యలు తీసుకుంటాం.

పురపాలికగా ఏర్పడిన సంవత్సరం: 2 జూన్ 2018

జనాభా: 16,685 ● మొత్తం వార్డులు: 12

అనుబంధ గ్రామాలు: కొడంగల్ పట్టణం, కొండారెడ్డిపల్లి, బుల్కాపూర్, పాతకొడంగల్, పాతకొడంగల్‌తండా, గుండ్లకుంట

పారిశుద్ధ్య సిబ్బంది: 35 మంది.

మేమున్నాం.. మీకు తోడుగా

వికారాబాద్‌టౌన్: 80742 74567
తాండూరు టౌన్: 80095 73260
పరిగి: 80095 73272
కొడంగల్: 94403 34770
(10 AM TO 1 PM)

న్యూస్‌టుడే, తాండూరు టౌన్: ? విశ్వేశ్వరనగర్ కాలనీలో అంతర్గత రోడ్లు పూర్తి స్థాయిలో లేక ఇబ్బందులు పడుతున్నాం. – వెంకట్, తాండూరు.

✔ రోడ్లు పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయటానికి చర్యలు తీసుకుంటాం.

– విక్రమ సింహారెడ్డి, పురపాలక సంఘం కమిషనర్, తాండూరు.

న్యూస్‌టుడే, ధారూర్: ? ప్రాథమిక సహకార సంఘం కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారిలో తాగునీటి పైపు లీకేజీ అవుతోంది. సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి. – రాజు, ధారూర్

✔ తాగునీరు కలుషితం కాకుండా చూస్తాం.

– అంజానాయక్, పంచాయతీ కార్యదర్శి ధారూర్.

న్యూస్‌టుడే, కుల్కచర్ల: ? నాలుగు నెలలుగా అనంతసాగర్ గ్రామానికి ప్రత్యేకాధికారి రావడం లేదు. గ్రామంలో చిన్న చిన్న పనులకు కూడా నిధుల కొరత అని అధికారులు అంటున్నారు.

–రాములు, అనంతసాగర్

✔ ఐసీడీఎస్ సీడీపీవోకు ప్రత్యేకాధికారిగా బాధ్యతలను అప్పజెప్పాం. గ్రామానికి వెళ్లని విషయంలో దృష్టి సారించి సమస్య పరిష్కరిస్తాం.

–రామకృష్ణనాయక్, ఎంపీడీవో కుల్కచర్ల

న్యూస్‌టుడే, పూడూరు: ? స్థానిక మహిళా సమాఖ్య కార్యాలయం వెనకవైపు పిచ్చిమొక్కలు, అపరిశుభ్రత నెలకొని ఉంది.

– లక్ష్మమ్మ, చీలాపూర్

✔ వర్షాకాలం ప్రారంభంలోనే నివారణ చర్యలు చేపట్టాం. మరోసారి పరిశీలించి సమస్యను పరిష్కరిస్తాం. – బందెయ్య, ఏపీఎం.

ఆదర్శ ప్రాయుడు పండిట్ దీన్‌దయాళ్



చిత్ర పటానికి నివాళులు అర్పిస్తున్న నాయకులు

తాండూరు టౌన్: భాజపా సిద్ధాంత కర్త, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ మాజీ అధ్యక్షుడు దీన్‌దయాళ్ పండిట్ అందరికీ ఆదర్శప్రాయుడని భాజపా నాయకులు అన్నారు. తాండూరు పట్టణంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన జయంతిని నిర్వహించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రమేష్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణ ముదిరాజ్, కార్యదర్శి భద్రేశ్వర్, జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు బొప్పి శ్రీహరి, పట్టణ అధ్యక్షుడు మల్లేషం, శాంత్‌కుమార్, కిరణ్, శ్రీకాంత్, ప్రభాకర్‌రెడ్డి, షాహబుద్దీన్, రాజు, కృష్ణ పాల్గొన్నారు.

రుణమాఫీకి రైతుల బారులు



కొడంగల్, న్యూస్‌టుడే: ప్రభుత్వం ప్రకటించి రుణమాఫీ తమ ఖాతాల్లో జమకాలేదని రైతులు ప్రతి రోజు బ్యాంకుల ముందు బారులు తీరుతున్నారు. బుధవారం ఉదయం 6 గంటలకే రైతులు తమ పాసుపుస్తకాలు ఇతర పత్రాలు తీసుకొని స్టేట్‌బ్యాంకు ముందు బారులుతీరి నిలబడ్డారు. ఇందులో కొంత మంది రైతులుకు డబ్బులు పడ్డాయని మరి కొందరికి డబ్బులు రావలేదని వాపోయారు.

తీరు మార్చుకోకుంటే గుణపాఠం తప్పదు

వికారాబాద్, న్యూస్‌టుడే: మాజీ ఎమ్మెల్యే డా. ఆనంద్.. మర్పల్లి మండలంలో ఓ కేసు విషయమై కాంగ్రెస్ పార్టీ, శాసనసభాపతిపై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని సహించేది లేదని, తీరు మార్చుకోకుంటే గుణపాఠం చెబుతామని నాయకులు విమర్శించారు. బుధవారం వికారాబాద్ క్యాంపు కార్యాలయంలో పట్టణ, మండల కాంగ్రెస్ అధ్యక్షులు సుధాకర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, పుర అధ్యక్షురాలు మంజుల, మాజీ అధ్యక్షుడు సత్యనారాయణ, సీనియర్ నాయకులు కిషన్‌నాయక్, రామచంద్రా రెడ్డి, అనంత్‌రెడ్డి విలేకరులతో మాట్లాడారు.

మోమిన్‌పేట, న్యూస్‌టుడే: మర్పల్లి ఘటనపై శాసన సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్‌ను మాజీ ఎమ్మెల్యే ఆనంద్, భారాస నాయకులు విమర్శించడం సరికాదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శంకర్, సీనియర్ నాయకుడు మహేందర్‌రెడ్డి అన్నారు. నాయకులు, కార్యకర్తలను రెచ్చగొట్టడం మానుకోవాలన్నారు.


అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకోం..

ధారూర్: శాసనసభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్‌పై మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకునేది లేదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మాన్‌సింగ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో విలేకర్ల సమావేశంలో మర్పల్లి ఘనటనపై ఆయన మాట్లాడారు. నేతలు రాములు, విజయబాస్కర్‌రెడ్డి, అశోక్ పాల్గొన్నారు.

మర్పల్లి ఘటన కేటీఆర్ దృష్టికి..

మర్పల్లి: సంబంధంలేని కేసు విషయంలో ఠాణాకు పిలిపించి పోలీసులు చితక బాదారని భారాస నాయకుడు ప్రవీణ్ తదితరులు పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. బుధవారం మండల నాయకులు జిల్లా భారాస అధ్యక్షుడు మెతుకు ఆనంద్‌తో కలిసి తెలంగాణ భవన్‌లో కేటీఆర్‌ను కలిసి పరిస్థితిని వివరించారు. గుర్తుతెలియని వ్యక్తి చనిపోతే ఎవరనేది నిర్ధారణ కాకముందే విచారణ పేరుతో వేధిస్తున్నారని నాయకులు వాపోయారు. బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్ పటేల్, మండల పార్టీ అధ్యక్షుడు శ్రీకాంత్, మోహన్‌రెడ్డి, అశోక్, రచన్న, మధుకర్, అంజన్న, యాదగిరి తదితరులు ఉన్నారు.

మట్టిదారితో అవస్థలు



తాండూరు మండలం చంద్రగిరి(దస్తగిరిపేట)కు పాలకేంద్రం పక్క వీధి నుంచి వెళ్లేందుకు మట్టిదారిలో ఇబ్బందులు ఏర్పడ్డాయి. దారిలో రాకపోకలకు స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. గత్యంతరం లేక ఎన్టీఆర్ కాలనీ, అంతారం మీదుగా చంద్రగిరికి చేరుకునేందుకు అదనంగా 3 కి.మీ. ప్రయాణిస్తున్నారు. –న్యూస్‌టుడే, తాండూరుగ్రామీణ

బైకులకు అడ్డాగా బస్‌షెల్టర్



పూడూరు గేటులోని బస్‌షెల్టర్‌లో కొందరు ద్విచక్ర వాహనాలను నిలిపి ఉంచుతున్నారు. ప్రయాణికులు తలదాచుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారు. హైదరాబాద్, బీజాపూర్ జాతీయ రహదారి కావటంతో చుట్టుపక్క గ్రామాల నుంచి నిత్యం ఎంతో మంది వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు. – న్యూస్‌టుడే, పూడూరు

అడవిలో సొమ్మసిల్లి పడిపోయిన బీట్ అధికారి

కిలోమీటరు దూరం భుజాలపై ఎత్తుకొచ్చిన తోటి సిబ్బంది

బషీరాబాద్: ఆక్రమణలను పరిశీలించేందుకు అటవీశాఖ ఎస్సై పీర్యా నాయక్, బీట్ అధికారి మల్లప్ప, స్నేహశ్రీ, మరికొందరు సిబ్బంది బుధవారం ఉదయం నీళ్లపల్లి-మైల్వార్ అటవీ ప్రాంతానికి వెళ్లారు. కొందరు భూమిని దున్నినట్లు గుర్తించారు. పలుమార్లు హెచ్చరించినా వినిపించుకోవడం లేదని ఆగ్రహానికి గురైన మల్లప్ప ఛాతిలో నొప్పి వస్తోందంటూ సొమ్మసిల్లి పడిపోయాడు. తోటి సిబ్బంది భుజాలపై ఎత్తుకొని రోడ్డు వరకు తీసుకొచ్చారు. తరవాత వాహనంపై తరలించి తాండూరులోని ఆస్పత్రిలో చేర్పించారు. ప్రస్తుతం ఆయన చికిత్స పొందుతున్నారు.

వర్షానికి దెబ్బతిన్న పంటల పరిశీలన

ధారూర్: మండల పరిధిలో మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి దెబ్బతిన్న పంటలను వ్యవసాయ విస్తరణ అధికారులు సంజు రాథోడ్, శిరీష బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మైలారం రెవెన్యూ పరిధిలోని లోతట్టు ప్రాంతంలో వాగుకు సమీపంలో ఉన్న దాదాపు 50 ఎకరాల్లో పత్తి, 20 ఎకరాల్లో కంది, 10 ఎకరాల్లో వరి పంట నష్టపోయినట్లు తెలిపారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తామన్నారు.

మహిళలకు కానుకగా గ్యాస్ పథకం

బషీరాబాద్, న్యూస్‌టుడే: సీఎం రేవంత్‌రెడ్డి మహిళలకు గ్యాస్ రాయితీ పథకాన్ని కానుకగా ఇచ్చారని మాజీ సర్పంచి, మాజీ ఎంపీటీసీ సభ్యులు నర్సిరెడ్డి, రాజేందర్‌రెడ్డి, విఫణి సభ్యులు నరేష్ అన్నారు. పంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం లబ్ధిదారులకు రాయితీ పత్రాన్ని అందించారు.

భౌతికశాస్త్ర బోధకులకు ఆహ్వానం

బషీరాబాద్, న్యూస్‌టుడే: బషీరాబాద్-ఇందర్‌చేడ్ మార్గంలోని ఆదర్శ పాఠశాల, కళాశాలలో ఫిజిక్స్ (పీజీటీ) బోధన చేసేందుకు పీజీ, బీఈడీ పూర్తి చేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ లక్ష్మీకాంత్ తెలిపారు. ఈనెల 28వ తేదీ లోపు నేరుగా పాఠశాలకు వచ్చి దరఖాస్తు ఇవ్వాలని కోరారు.

ఎంఈవోకు శుభాకాంక్షలు

బొంరాస్‌పేట (కొడంగల్): దుద్యాల మండల విద్యాధికారిగా బాధ్యతలను తీసుకొన్న విజయరామారావుకు ఎస్టీయూ టీఎస్ సంఘం సభ్యులు సన్మానించారు. బుధవారం దుద్యాలలోని ఉన్నత పాఠశాల ప్రాంగణంలో సన్మాన అనంతరం మాట్లాడారు. వేణుగోపాల్, రవీందర్, అంజిలయ్య, ఆశప్ప పాల్గొన్నారు.

పరిగి గ్రామీణ: ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం పరిగి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల నెం.1 ప్రధానోపాధ్యాయుడు గోపాల్ బుధవారం పరిగి మండల ఇన్‌ఛార్జి విద్యాధికారిగా బాధ్యతలను చేపట్టారు.



నిమజ్జనానికి తీసుకొని వెళ్తున్న మహిళలు



మున్సిపల్ వైస్ ఛైర్మన్ నివాసంలో తయారీ



చెరువు వద్ద నిమజ్జనం చేస్తున్న మహిళలు

బతుకమ్మ సంబురాలు

కొడంగల్, న్యూస్‌టుడే: గ్రామాల్లో బతుకమ్మ సంబురాలు ప్రారంభం అయ్యాయి. బుధవారం మున్సిపల్ వైస్ ఛైర్మన్ ఉషా రాణి నివాసంలో చుట్టు పక్కల మహిళలు అంతా కలసి రంగు రంగుల పువ్వులతో తయారు చేశారు. ఆట పాటలతో ఊరేగింపుగా నిమజ్జనానికి వెళ్లారు.

వేరుసెనగ సాగు.. రైతన్న జోరు



నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో రైతులు వేరుశనగా విత్తనాలు నాటేందుకు పొలం పనులు సిద్ధం చేసుకొన్నారు. పెసర, మినుము ఇతర పంటలను నూర్పిడి చేసిన తరువాత వేరుశనగ పంట కోసం యాసంగి పంటగా సాగు చేసుకొంటున్నారు.

– న్యూస్‌టుడే, కొడంగల్

గురువుల మార్గదర్శకత్వంలో నడవాలి



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

వికారాబాద్ మున్సిపాలిటీ, న్యూస్‌టుడే: అధ్యాపకులు, తల్లిదండ్రుల మార్గదర్శకత్వంలో నడిస్తే విద్యార్థులు ఉన్నతంగా ఎదుగుతారని పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా. పీవీ. గీతాలక్ష్మి పట్నాయక్ అన్నారు. బుధవారం కళాశాల ఆవరణలో నూతన విద్యార్థుల స్వాగత కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఉన్నత లక్ష్యాలను ఏర్పర్చుకొని సాధనకు నిరంతరం కృషి చేయాలన్నారు. అనంతరం విద్యార్థినుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ సత్యనారాయణరెడ్డి, అధ్యాపకులు డా. రవీందర్, రాధిక, మల్లయ్య, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతి లబ్ధిదారుడి ఆరోగ్యాన్ని పర్యవేక్షించాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో విశ్వప్రసాద్

తాండూరు గ్రామీణ: అంగన్‌వాడీ కేంద్రాల్లో నమోదైన ప్రతి లబ్ధిదారుడి ఆరోగ్యాన్ని అంగన్‌వాడీ టీచర్లు తప్పనిసరిగా పర్యవేక్షించాలని ఎంపీడీవో విశ్వప్రసాద్ సూచించారు. తాండూరు స్త్రీ శిశు సంక్షేమ శాఖ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన పోషణ మాసం కార్యక్రమాల్లో సీడీపీవో కాంతారావు, సహాయ సీడీపీవో శ్రీలక్ష్మితో కలిసి ఎంపీడీవో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏపీఎం ఆనంద్, పర్యవేక్షకులు నిర్మల, సుశీల, సునీత, మీనాక్షి, జ్యోతి, రాణి పాల్గొన్నారు.

గ్యాస్ రాయితీ పత్రాల అందజేత

తాండూరు: పట్టణంలోని 21వ వార్డులో బుధవారం కౌన్సిలర్ సల్మా ఫాతిమా స్థానిక మహిళలకు వంటగ్యాస్ సిలిండర్లకు సంబంధించిన రాయితీ ధ్రువపత్రాలను అందజేశారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కరించండి

బొంరాస్‌పేట (కొడంగల్): టీచర్ల సమస్యలను పరిష్కరించాలని యూటీఎఫ్ సభ్యులు డిమాండ్ చేశారు. బుధవారం మండలం కేంద్రంలోని మండల విద్యావనరుల కార్యాలయం అవరణలో ఎంఈవో హరిలాల్‌కు సంఘం మండల అధ్యక్షుడు గోపాల్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు.

శునకాల నుంచి రక్షణ కల్పించండి

మోమిన్‌పేట: కుక్కల బెడదతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వెంటనే వాటి నివారణకు చర్యలు చేపట్టాలని భారాస యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజేందర్‌గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నాలుగు రోజుల క్రితం మోమిన్‌పేటకు చెందిన బాలుడు మోయిజ్ కుక్క కాటుకు గురయ్యాడు. బుధవారం ఆయన బాలుడి గృహానికి వెళ్లి పరామర్శించి బాలుడి తల్లిదండ్రులకు ఆర్థిక సహాయం అందజేశారు.

బెల్ట్ షాపులను ఎత్తేయాలి

బంట్వారం: గ్రామాల్లో విచ్చలవిడిగా కొనసాగిస్తున్న బెల్ట్ షాపులను ఎత్తివేయాలని భాజపా మండల అధ్యక్షుడు మహేష్ యాదవ్ అన్నారు. మండల కేంద్రంలో తహసీల్దార్, ఎంపీడీవో, పోలీస్ ఠాణాలో వినతిపత్రం అందజేశారు.

కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడిగా అజ్మతుల్లా నియామకం

కుల్కచర్ల గ్రామీణ: పుట్టాపహాడ్ కాంప్లెక్స్ పాఠశాలల ప్రధానోపాధ్యాయుడిగా ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అజ్మతుల్లా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు ప్రధానోపాధ్యాయుడిని సన్మానించారు. ఉపాధ్యాయులు రాములు, రమేష్, కృష్ణయ్య, సీఆర్‌పీ రమేష్ పాల్గొన్నారు.

పంచాయతీ సిబ్బందికి ఆరోగ్య పరీక్షలు

కుల్కచర్ల గ్రామీణ: పంచాయతీ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించినట్లు ఏఎన్ఎంలు యాదమ్మ, వెంకటమ్మ తెలిపారు. ముజాహిద్‌పూర్ గ్రామ పంచాయతీ ఆవరణలో పంచాయతీ సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించారు.

చెరువు పాటు కాలువల పరిశీలన

కుల్కచర్ల గ్రామీణ: ముజాహిద్‌పూర్ గ్రామంలోని అక్కమ్మ చెరువు పాటు కాలువలు, తూమును పరిశీలించినట్లు ముజాహిద్‌పూర్ పంచాయతీ కార్యదర్శి సంతోష్ కుమార్, మాజీ ఉప సర్పంచి చంద్రభూపాల్‌రావు తెలిపారు. వారు మాట్లాడుతూ.. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున తూము, కాలువల పరిస్థితి ఎలా ఉందనే విషయాలను పరిశీలించామన్నారు.

సీపీఎం బలోపేతానికి కృషి

కొడంగల్: సీపీఎం బలోపేతానికి ప్రతి ఒక్కరూ.. కృషి చేయాలని జిల్లా కార్యవర్గ సభ్యులు వెంకటయ్య అన్నారు. బుధవారం పార్టీ మూడో మహాసభలను కొడంగల్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. అనంతరం మూడు మండలాలకు కార్యదర్శులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మోహన్, అశోక్, లక్ష్మణ్, అంజిలయ్య, సాయిదాస్, రాఘవేంద్ర పాల్గొన్నారు.

చరవాణుల వినియోగంతో విద్యార్థులకు ప్రమాదం

యాలాల: విద్యార్థులు చరవాణీలకు దూరంగా ఉండాలని జడ్పీటీసీ మాజీ సభ్యుడు సిద్రాల శ్రీనివాస్ అన్నారు. బుధవారం యాలాల బాలికల ఉన్నత పాఠశాలలో మాట్లాడారు. ఇటీవల చిన్నారులు ఎక్కువగా చరవాణులు వాడుతున్నరని దీంతో వారు మూగవారిగా మారి చదువుకు దూరం అయ్యే అవకాశం లేకపోలేదన్నారు.

మహేందర్‌రెడ్డి ఆసుపత్రి ఆధ్వర్యంలో వైద్యశిబిరం

పూడూరు: మహేందర్‌రెడ్డి ఆసుపత్రి కిష్టంరవి ఆధ్వర్యంలో బుధవారం ఎన్కేపల్లి గ్రామంలో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురికి వైద్య చికిత్సలు చేసి మందులు పంపిణీ చేశారు.

శిథిల వంతెనలతో గుబులు

తాండూరు-చించోళి మార్గంలో దుస్థితి

న్యూస్‌టుడే, తాండూరుగ్రామీణ

జాతీయ రహదారి మార్గంలో వంతెనలు శిథిలావస్థకు చేరాయి. అధ్వానంగా మారిన ఆ దారిలో గతంలోనూ ప్రమాదాలు జరిగాయి. తాజాగా వర్షాలకు అవన్నీ మరింత దెబ్బతిన్నాయి. దీంతో ఎప్పుడు ఎక్కడ ముప్పుపొంచి ఉందోనని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు నిర్మాణాలపై దృష్టిసారించి పూర్తి చేయించాల్సి ఉంది. ఈనేపథ్యంలో 'న్యూస్‌టుడే' కథనం.

తాండూరు-చించోళి జాతీయ రహదారి మార్గంలో ప్రతిరోజు రాత్రి పగలు వాహనాల రద్దీ కొనసాగుతుంది. దాదాపు 5వేల వాహనాలు వచ్చిపోతాయి. రద్దీ మార్గంలోని వంతెనలు దయనీయంగా మారాయి. అల్లాపూర్, ఐనెల్లి, కొత్లాపూర్ కర్ణాటక సరిహద్దులోని వంతెనలు శిథిలాస్థకు చేరాయి. ఇరువైపులా రక్షణ గోడలు కూలిపోయి నాలుగైదు సంవత్సరాలు గడిచింది. వాహనాలు వంతెన కిందకు దూసుకెళ్లకుండా అధికారులు ఇసుక బస్తాలు ఉంచి కర్రలు, దారం ఏర్పాటు చేశారు. వంతెన రహదారిపై అడుగులోతు గుంతలు దర్శనమిస్తున్నాయి. సూచికలు సైతం అమర్చలేదు. భారీ వర్షం కురిస్తే వరద ప్రవాహం వంతెనల మీదుగా గంటల తరబడి కొనసాగుతుంది. దీంతో అటుఇటు కి.మీ. పొడవునా వాహనాలు ఆగిపోవాల్సిన పరిస్థితి. దెబ్బతిన్న వంతెన మీద ప్రమాదాలు జరగడంతో ఆరు సంవత్సరాల్లో ఎనిమిది మంది మృతి చెందారు. ఇటీవల కురిసిన వర్షాలకు వంతెనల మరింత ప్రమాదకరంగా మారాయి. ప్రమాదాలు పునరావృతం కాకుండా ఉండేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని వాహనదారులు, ప్రయాణికులు కోరుతున్నారు.



అల్లాపూర్ వద్ద వంతెన ఇలా..



ఐనెల్లి శివారులో..

నిధులు మంజూరు..

తాండూరు-చించోళి మార్గాన్ని జాతీయ రహదారిగా ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఏడాది పనులు చేపట్టారు. కానీ నత్తనకన పనులు కొనసాగిస్తున్నారు. అల్లాపూర్ నుంచి ఐనెల్లి వరకు రహదారికి ఎడమ ఒకవైపు జాతీయ రహదారి నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. ఆరు కిలోమీటర్ల మార్గంలో ఏడాది గడిచినా.. మట్టి, కంకర పనులే నిర్వహిస్తున్నారు. తారు పనులకు ఇంకెన్ని నెలలు పడుతుందోనని వాహనదారులు వాపోతున్నారు. మరోవైపు పాత రహదారి గుంతలు పడి దెబ్బతింది. గతుకుల దారిలో రాకపోకలవేళ పెద్దఎత్తున దుమ్ము వెలువడుతుండటంతో వాహనదారులు, ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. రహదారితోపాటు ఇదే మార్గంలోని వంతెనలను వేగంగా నిర్మిస్తే ప్రమాదాల భయం వీడనుంది. నిధులు మంజూరైనందున వంతెన పనులు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. వర్షాలు తగ్గుముఖం పట్టినందున పనులు చేపడితే వేసవిలోగా పూర్తి చేసే వీలుంటుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.